క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



రూ.50 వేలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు మనోహర్‌శెట్టి

బొమ్మనహాళ్: మండలంలోని కల్లుదేవనహళ్లిలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, చెన్నకేశవ స్వామి విగ్రహాల ఏర్పాటుకు దర్గాహొన్నూరు వైఎస్సార్‌సీపీ నాయకుడు మనోహర్‌శెట్టి రూ.50 వేలు నగదును ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో ఆలయ అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కందేపల్లి రమేష్, ఆలయ పూజారి చంద్రశేఖర్‌స్వామి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బేడ, బుడగ జంగాలను ఎస్సీల్లో చేర్చాలి



కేంద్ర న్యాయశాఖ మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నేతలు

ఉరవకొండ: రాష్ట్రంలోని బేడ, బుడగ జంగాలను ఎస్సీల్లో చేర్చాలని కేంద్ర న్యాయశాఖమంత్రి నారాయణస్వామిని బుడగ జంగాల నేతలు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. మంగళవారం ఢిల్లీలో మంత్రి నివాసంలో బుడగ జంగాల నేత ఎలమర్తి మధు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న తదితరులు మంత్రిని కలిశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగు లక్షల మంది బేడ, బుడగ జంగాల వారున్నారని, సంచార జీవనం గడుపుతున్న వారిని పక్క రాష్ట్రాలు ఎస్సీలుగా గుర్తిస్తున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కూడా వారిని ఎస్సీలుగా గుర్తించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిందన్నారు. ఆ తీర్మానంపై వెంటనే నిర్ణయం తీసుకోవాలని కేంద్ర మంత్రిని వారు కోరారు. ఈమేరకు వినతిపత్రం అందించారు.

కుష్టు సర్వే పక్కాగా చేపట్టండి

కూడేరు: ఈ నెల 27 నుంచి జనవరి 12 వరకూ కుష్టు సర్వే పక్కాగా చేపట్టాలని సీహెచ్‌ఓ వరలక్ష్మి ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె ఆశావర్కర్లతో సమావేశమయ్యారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు సీజనల్ వ్యాధులు, దోమకాటుతో వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్నారు. హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపి సుఖ ప్రసవం జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రవీంద్ర, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మకమలాలు




కూడేరు: మండల కేంద్రంలోని మసీదు దగ్గర నివాసమున్న మఠం భాస్కర్ ఇంటి పెరట్లో మంగళవారం వేకువజామున బ్రమ్మకమలాలు వికసించాయి. వాటిని చూడడానికి ఇరుగుపొరుగు వారు ఆసక్తి చూపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు బీసీ కాలనీలో సీజనల్ వ్యాధులపై వైద్యాధికారులు మంగళవారం అవగాహన కల్పించారు. అలాగే డాక్టర్ సునీల్‌కుమార్‌నాయక్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కోదండరామిరెడ్డి, సచివాలయ ఏఎన్ఎం శ్రావణి, ఆశా వర్కర్లు సర్పంచు బీబ్లారాణి సమక్షంలో బీసీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి రక్త పరీక్షలు నిర్వహించారు. దోమల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఓటరు జాబితా పక్కాగా ఉండాలి



మాట్లాడుతున్న గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి

వజ్రకరూరు: ఓటరు జాబితా పక్కాగా ఉండేలా చూడాలని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో క్లెయిమ్‌ల పరిష్కారం, అభ్యంతరాలు తదితర వాటిపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్లెయిమ్‌ల పరిష్కారంలో నిబంధనలు పాటించాలని, రాజకీయ పార్టీల నుంచి విమర్శలు తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ కేశవరెడ్డి, సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



మాట్లాడుతున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్



హాజరైన వలంటీర్లు, పార్టీ నాయకులు

- సంక్షేమ పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లండి
- మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ సూచించారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం వలంటీర్లు, మండల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చిన ఘనత కేవలం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. రాబోవు ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌ను మరోసారి బలపరచడానికి ప్రజలు ఏకం కావాలన్నారు. అందిన సంక్షేమాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. ప్రతి కుటుంబానికీ అందిన సంక్షేమంపై మరోసారి ప్రజల వద్దకు వెళ్లి వివరించాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం ద్వారా ప్రతి సచివాలయ పరిధిలో జరిగిన అభివృద్ధిని తెలియజేసేలా కార్యక్రమాలను రూపొందించుకోవాలన్నారు. త్వరలో కళ్యాణదుర్గం నియోజకవర్గం తలమానికమైన బీటీపీ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే కాలువ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. సీఎం వైఎస్ జగన్ బీటీపీ కాలువ నిర్మాణంపై చిత్తశుద్ధితో ఉన్నారన్నారు. రాబోవు రోజుల్లో బీటీపీ ద్వారా ప్రతి రైతుకూ సాగు నీరు అందించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నా. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు హరినాథ్‌రెడ్డి, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

కరువు రైతులను గట్టెక్కించండి

- కేంద్ర బృందానికి ప్రభుత్వ విప్ వినతి



కరువుపై కేంద్ర బృందానికి వివరిస్తున్న విప్ కాపు

రాయదుర్గం/కళ్యాణదుర్గం రూరల్: ఈ ఏడాది వర్షభావ పరిస్థితులు అన్నదాతలను వెంటాడాయి. ఖరీఫ్ ఆరంభం నుండి చినుకుజాడ లేక పంటలన్నీ పొలాల్లోనే ఎండాయి. ఓ వైపు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారు. మీ వంతు సహాయం అందించి రైతులను ఆదుకోవాలంటూ 'కేంద్ర కరువు బృందం' సభ్యులకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం నియోజకవర్గంలోని గుమ్మఘట్ట మండలం 75 వీరాపురం సమీపాన రైతులు క్రిష్ణస్వరూప్, మాంతెష్ 11:30 ఎకరాల్లో వర్షాధారంగా సాగుచేసిన వేరుశనగ పంటను కేంద్ర కరువు బృందం పంకజ్‌శర్మనాయత్వంలో టీం మెంబర్-2 కు చెందిన దేవేంద్రరావ్, అంజుశ్రీ, ప్రదీప్‌కుమార్‌తో పాటు ఆర్డీఓ రాణిసుష్మిత, ఏడీఏ లక్ష్మానాయక్, ఏపీడీ జయకుమార్, రాష్ట్ర, జిల్లా కు చెందిన పలు శాఖల అధికారులతో కలసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డితో కలసి ముందే అక్కడికి చేరుకున్న విప్ కాపు కరువుపై ఇంగ్లిష్‌లో వారికి అర్థమయ్యేలా వివరించారు. సంబంధిత రైతులను పిలిపించి ఎదురైన కష్ట, నష్టాలపై తెలిపారు. అనంతరం కరువు చిత్రాలతో ఏర్పాటు చేసిన పోటో ఎగ్జిబిషన్‌ను కరువు బృందం తిలకించింది. అనంతరం విప్ కాపు వారితో కరువు పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. పంట సాగుచేసి నష్టపోయిన ప్రతి రైతును పెద్ద మనసుతో ఆదుకోవాలన్నారు. మా రైతన్నల కష్టాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పెద్ద మొత్తం లో పరిహారం అందించేలా కృషి చేయాలని విజ్ఞప్తిచేశారు. ఇందుకు కరువు బృందం సభ్యులు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో అన్నీ శాఖల జిల్లా, డివిజన్ అధికారులు, జెడ్పీటీసీ పీఎస్ మహేష్, గుమ్మఘట్ట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గౌని కాంతారెడ్డి, సర్పంచులు కేపీదొడ్డి రమేష్, కోట్ల ఉమేష్‌రెడ్డి, పార్టీ నాయకులు ఆర్టీ కాంతారెడ్డి, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మెన్ మేకల శ్రీనివాసులు, బేలేడు రామాంజనేయులుతో పాటు స్థానిక నాయకులు నాయకుల రవి, గుమ్మఘట్ట కేఎమ్ రాజు పాల్గొన్నారు. అంతకుముందు వారు కళ్యాణదుర్గంలోని బైపాస్‌రోడ్డు వద్ద ఉన్న పంట పొలాల్లో పర్యటించి కంది, ఆముదం పంటలను పరిశీలించారు. ఎకరాకు రూ.15 వేలు పరిహారం అందించాలని రైతులు కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాణి సుస్మిత, తహసీల్దార్ ఫణీంద్ర, ఏడీఏ ఎల్లప్ప, విద్యుత్ అధికారులు, హార్టికల్చర్ అధికారులు, అగ్రికల్చర్ అధికారులు, రెవిన్యూ అధికారులు, కేవీకే అధికారులు సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్రైస్తవులకు ఇచ్చిన మాట నిలుపుకున్న విశ్వ



క్రిస్టియన్ కమ్యూనిటీ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు

ఉరవకొండ: నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న క్రైస్తవులకు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఇచ్చిన మాట ప్రకారం కమ్యూనిటీ భవన నిర్మాణానికి మేజర్ పంచాయతీకు చెందిన 15 సెంట్ల స్థలాన్ని కేటాయించేలా కృషి చేశారు. మంగళవారం స్థానిక లక్ష్మీనృసింహస్వామికాలనీ ప్రభుత్వ పాఠశాల వద్ద ఉన్న 15 సెంట్ల పంచాయతీ స్థలాన్ని కేటాయించారు. ఈ సందర్భంగా క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆరోగ్యనాథ్, కార్యదర్శి జోషవనంద్, ఉపాధ్యక్షుడు ఆనంద్, కోశాధికారి పాస్టర్ సురేష్ ఆధ్వర్యంలో జేసీబీలు ఏర్పాటు చేసి జంగిల్ క్లియరెన్స్ ప్రారంభించారు. పనులను ఎంపీపీ నరసింహులు, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, పార్టీ పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి, మండల సమన్వయకర్త ఓబన్న, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, ఆంజనేయులు పరిశీలించారు. మాజీ ఎమ్మెల్యే ఇచ్చిన మాటప్రకారం నియోజకవర్గంలోని క్రైస్తవుల కమ్యూనిటీ భవనానికి కేటాయించడం గొప్ప విషయమన్నారు. ముఖ్యంగా సర్పంచ్ లలితమ్మ కృషి ఎంతో ఉందన్నారు. క్రిస్టియన్లు మొత్తం మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డికి అండగా ఉంటారన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న శ్రీ చరణ్

కళ్యాణదుర్గం రూరల్: అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీ చరణ్ అన్నారు. మండలంలోని శీబాయి, చాపిరి, బోరంపల్లి, కొత్తూరు, హుళికల్లు, గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 21న సీఎం జగన్ పుట్టిన రోజు సందర్భంగా పట్టణంలో 20 తేదీ బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. బైక్ ర్యాలీ విజయవతం చేయాలని నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపతం చేయాలని, జగనన్న ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిచాలన్నారు. అలాగే గతంలో టీడీపీ ప్రభుత్వం చేసిన అరాచకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఫణి, జెడ్పీటీసీ బొమ్మన్న, పార్టీ మండల కన్వీనర్ సర్వోత్తం, పట్టణ జేసీఎస్ కన్వీనర్ అర్చన, జేసీఎస్ మండల కన్వీనర్ ఆంజనేయులు, వైస్ ఎంపీపీ కాంతమ్మ, సర్పంచ్‌లు ఎంపీటీసీలు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా అమావాస్య పూజలు



బొమ్మనహాళ్: అలంకరణలో వీరభద్ర స్వామి



పూజలందుకుంటున్న నేమకల్లు ఆంజనేయస్వామి



వజ్రకరూరు: అలంకరణలో రామేశ్వరస్వామి

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని వీరభద్ర స్వామి ఆలయంలో మంగళవారం అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, రుద్రాభిషేకం, హోమాలు, ఆకుపూజ చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అలాగే మండలంలోని నేమకల్లు అంజన్నకు అమవాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

కిక్కిరిసిన శివాలయాలు

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం అమావాస్యను పురస్కరించుకుని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండల కేంద్రంలోని నగరేశ్వరస్వామి, రామేశ్వరస్వామి, భోగేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేకపూజలతోపాటు అభిషేకాలు, అర్చనలు, మహామంగళహారతి, అన్నదానం నిర్వహించారు. అలాగే కొనకొండ్ల గ్రామంలోని ఛాయామల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు.

హంద్రీనీవా నీరు జీబీసీకీ తరలించేందుకు కృషి

విడపనకల్లు: హంద్రీనీవా నీటిని గుంతకల్లు బ్రాంచి కెనాల్‌కు తరలించే దిశగా మంగళవారం ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసన్న, రైతులు కలసి జేసీబీతో పనులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ జీబీసీ కింద రైతులు సాగుచేసిన మిరప, పత్తి, శనగ ఇతర పంటలు ఎండిపోకుండా కాపాడేందుకు ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసికెళ్లి హంద్రీనీవా నీరును జీబీసీకి తరిలించేందకు కృషి చేశారన్నారు. మరో రెండు రోజుల్లో జీబీసీకి నీరు సరఫరా అవుతాయన్నారు. జీబీసీకి నీరు రాకుండా చేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా టీడీపీ నాయకులు కుట్రలు పన్నుతున్నారన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

రాయదుర్గంటౌన్: ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎన్ఎంయూఏ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎన్ఎంయూఏ రాష్ట్ర కమిటీ 59 సమస్యలతో రెండు రోజులపాటు నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు కార్యదర్శి హెచ్‌టీ స్వామి తెలిపారు. తొలిరోజు మంగళవారం ఉదయం డిపోలో ఎర్రబ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలిపారు. అనంతరం గ్యారేజీ గేటు ముందు ధర్నా చేసి సీసీఎస్ డెలిగేట్ నాగరాజు, జగదీష్, రమేష్, తిమ్మరాజు, బాలాజీనాయక, జిలాన్, వలి పాల్గొన్నారు.

టీచర్ ఆత్మహత్యాయత్నంపై రాజకీయం సిగ్గుచేటు

ఉరవకొండ: టీచర్ మల్లేష్ వ్యక్తిగత కారణలు ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడితే రాజకీయం చేయడం తగదని వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా నాయకుడు ముల్లా జిలాన్ విమర్శించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పా టు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుడు ఆరోగ్యం సరిగా లేక విపరీతమైన అప్పులు చేసి ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనోవేదనకు గురైనట్లు అతని భార్య, కుటుంబ సభ్యులు స్పష్టం చేశారన్నారు. ఉపాధ్యాయుడికి బెట్టింగ్ అలవాటు ఉండటంతో రూ.25.60లక్షలు వరకూ అప్పు చేశాడన్నారు. అప్పులిచ్చిన వారి ఒత్తడి తట్టుకోలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడితే ఎల్లో మీడియా సీసీఎస్ రద్దు కాలేదని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై అసంతృప్తి ఉందని దుర్మార్గపు రాతలు రాయడం సిగ్గుచేటన్నారు.

పోస్టల్ ఉద్యోగుల సమ్మె

రాయదుర్గంటౌన్/కణేకల్లు/ఉరవకొండ/కంబదూరు/కూడేరు: డిమాండ్ల పరిష్కారం కోరుతూ గ్రామీణ డాక్ సేవక్ ఉద్యోగులు(జీడీఎస్) మంగళవారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టారు. ఆలిండియా జీడీఎస్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్స్ సేవక్స్ ఇచ్చిన పిలుపు మేరకు సమ్మె నిర్వహిస్తున్నట్లు రాయదుర్గం సబ్ డివిజన్ జనరల్ సెక్రటరీ టి.కృష్ణప్ప తెలిపారు. పట్టణంలోని ఓబుళాచారీ రోడ్డు నందు గల ప్రధాన పోస్టాఫీసు వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో దాదాపు 45 మంది జీడీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు. జీడీఎస్ ఉద్యోగుల న్యాయపరమైన ఎనిమిది డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. అలాగే కణేకల్లు, బొమ్మనహాళ్, ఉరవకొండ, కంబదూరు, కూడేరు మండలాల్లోని జీడీఎస్ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు.

నమ్మకద్రోహి చంద్రబాబు



అభివృద్ధి, సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

- సీఎం జగన్‌తోనే సంక్షేమ పథకాల కొనసాగింపు
- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గంటౌన్: అధికారంలోకి వచ్చి మేనిఫెస్టోలోని హామీలను అమలు చేయకుండా ప్రజలను నట్టేట ముంచిన నమ్మక ద్రోహి చంద్రబాబు అని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి విమర్శించారు. మరోవైపు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుని 99 శాతం హామీలు అమలు చేసిన జగనన్న సీఎంగా ఉంటేనే..పేదలకు సంక్షేమ పథకాలు కలకాలం కొనసాగుతాయన్నారు. మంగళవారం పట్టణంలోని 18వ సచివాలయం పరిధిలోని 30, 31 వార్డుల్లో వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని విప్ ప్రారంభించారు. తొలుత సచివాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, కౌన్సిలర్లు తాడూరు భాగ్య, కొంతం దేవరాజులతో కలసి అభివృద్ధి, సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం సచివాలయ సమీపంలో పార్టీ జెండాను పట్టణ కన్వీనర్ అరవా శివప్ప, పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులతో కలసి విప్ ఎగురవేశారు విప్ మాట్లాడుతూ విప్లవాత్మకమైన సంక్షేమ పథకాలతో పేదల తలరాత మార్చుతున్న సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలన్నారు. 2024 ఎన్నికల్లో టీడీపీ పూర్తిగా కనుమరుగుకావడం ఖాయమని అర్థమై ప్రజలను మభ్యపెట్టేందుకు చంద్రబాబు, టీడీపీ నాయకులు దుర్మార్గపు, కుటిల రాజకీయాలకు తెర తీశారని దుయ్యబట్టారు. టీడీపీ దొంగల మాటలు విని మోసపోకుండా ఇంటి వద్దకు చేరుతున్న సంక్షేమాన్ని దూరం చేసుకోవద్దని సూచించారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో అర్హులకు సంతృప్తికరంగా పథకాలు అందుతున్నాయని, ఇలాంటి సంక్షేమ సారథిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీ హౌసింగ్ డైరెక్టర్ ఇల్లూరి శ్రీనివాసులు, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మేకల శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీనివాసయాదవ్, వలిబాషా, కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, గౌని లావణ్య, బండి అజయ్, డిష్ గోవిందు, షబ్బీర్, శ్రీనివాసరెడ్డి, ప్రతాప్, తట్టే మంజునాథ, కోఆప్షన్ సభ్యులు బ్యూలా, నజీర్, వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, కృష్ణమూర్తి, వైజాగ్ రిబ్కా, గోరంట్ల సత్యనారాయణ, దివాకర్, నిజాముద్దీన్, వైజాగ్ రవి, ఆంజనేయులు, గంగాధర్ పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌తో రూ.కోట్లు దోచుకున్నారు..

రాయదుర్గంటౌన్: టీడీపీ ఐదేళ్ల అధికారంలో ఉండి చివరి ఆరునెలలు అన్నా క్యాంటీన్లు పెట్టి రూ.కోట్లు దోచుకున్న నీచ చరిత్రను మర్చిపోయి సిగ్గులేకుండా మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అన్నా క్యాంటీన్ వద్ద సెల్ఫీ తీసుకుని కారుకూతలు కూస్తున్నారని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. ప్రజలకు అన్నం పెట్టాలనే ఆలోచన టీడీపీకి ఉంటే నాలుగున్నరేళ్ల గాడిదలు కాశారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలవ కుయుక్తులు, దొంగబుద్దులు ప్రజలకు తెలుసన్నారు. పద్ధతి మార్చుకోరపోతే ప్రజలు శాశ్వతంగా తరిమికొడతారన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



ప్రణయ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

ఉరవకొండ: పట్టణానికి చెందిన టీడీపీ నాయకులు పెద్దఎత్తున వైఎస్సార్‌సీపీలోకి చేరారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ యువజన విభాగం జోనల్ చైర్మన్ ప్రణయ్‌రెడ్డి సమక్షంలో టీడీపీ మైనార్టీ నాయకులు ఏజాయజ్, గౌస్, బషీర్, సిద్దా, కాశీ తమ అనుచరులతో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ప్రణయ్‌రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి చేపట్టిన అభివృద్ధిని చూసి ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలోకి చేరామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, పార్టీ పట్టణ మైనార్టీ కన్వీనర్ పామిడి జాకీర్, బళ్లారి ఆసీఫ్, పామిడి సలీం, హోతురు బాషా, అన్వర్, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, అయ్యర్‌దాదు, వన్నూర్‌సాబ్, ఖాజ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వ్యక్తి అదృశ్యం



తిప్పారెడ్డి

కణేకల్లు: మండలంలోని యర్రగుంట గ్రామానికి చెందిన తిప్పారెడ్డి (35) ఏడు రోజుల క్రితం అదృశమయ్యాడు. పోలీసుల కథనం మేరకు... తిప్పారెడ్డి కణేకల్లు క్రాస్‌లోని ఓ రైస్‌మిల్లులో ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 5న ఉదయం మిల్లుకెళుతానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. ఒకసారి మిల్లుకెళ్లితే మూడ్రోజుల పాటు అక్కడే ఉండి... మరుసటి రోజు ఇంటికొస్తాడు. అయితే ఈ సారి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యుల్లో ఆందోళన నెలకొంది. మిల్లుకెళ్లి ఆరా తీస్తే.. పనికి రాలేదన్నారు. దీంతో బంధువులు, స్నేహితులకు ఫోన్ చేసినా ఆచూకీ లభించలేదు. అతని ఫోన్ కూడా స్విచ్ఛాఫ్‌లో ఉంది. దీంతో కుటుంబసభ్యులు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


ఆప్కో మాజీ డైరెక్టర్ మృతి



కొత్త శ్రీనివాసులు(ఫైల్)

ఉరవకొండ: పట్టణానికి చెందిన ఆప్కో మాజీ డైరెక్టర్, ఉరవకొండ చేనేత బ్లాక్ లెవెల్ క్లస్టర్ చైర్మన్ కొత్త శ్రీనివాసులు(50) మంగళవారం కిడ్నీ సంబంధిత వ్యాధితో అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతిపై ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, అనంతపురం ఎంపీ తలారిరంగయ్య, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు, స్థానిక చేనేత నాయకులు సంతాపం తెలిపారు.

వైభవంగా ఆంజనేయస్వామి రథోత్సవం



గుమ్మఘట్ట: మండలంలోని జె.వెంకటంపల్లిలో ఆంజనేయస్వామి రథోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో స్వామికి పంచామృతాభిషేకం, ఆకుపూజ, పుష్పాలంకరణ, మహామంగళారతి తదితర పూజలను నిర్వహించారు. అనంతరం స్వామి ఉత్సవ విగ్రహాన్ని రథంలో అధిష్టించి గ్రామంలో మేళతాళాలు, డప్పులతో ఊరేగించారు. రథం ముందు యువకులు ఉత్సాహంగా నందికోళ్లతో నృత్యం చేస్తు చిందులు వేశారు. బుధవారం స్వామిని ముత్యాలపల్లకిలో ఊరేగించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

అంబేడ్కర్ కాలనీలో సిమెంట్ రోడ్లు నిర్మిస్తాం

కుందుర్పి: మలయనూరు అంబేడ్కర్ కాలనీలో త్వరలో సీసీ రోడ్లను నిర్మిస్తామని ఎంపీడీఓ లక్ష్మీనరసింహ తెలిపారు. ఇటీవల కలెక్టర్ గౌతమికి మలయనూరు ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు నిర్మించాలని కాలనీవాసులు వినతి పత్రం అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం మలయనూరులో పర్యటించిన ఎంపీడీఓ బృందం నెల రోజుల్లో సిమెంట్ రోడ్లు వేస్తామన్నారు. సచివాలయ సిబ్బంది ఎప్పటికప్పుడు గ్రామ సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలన్నారు.ఎంపీడీఓ వెంట సర్పంచ్ గోవిందమ్మ, పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, ఇంజినీర్ పవన్‌కుమార్, కాలనీవాసులున్నారు.

ప్రభుత్వాస్పత్రిలోనే సురక్షిత కాన్పు

ఉరవకొండ: రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు గర్భిణులకు ప్రభుత్వాస్పత్రుల్లోనే సురక్షిత కాన్పులు అయ్యేలా ఆశా కార్యకర్తలకు కృషి చేయాలని రాకెట్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్‌నాయక్ సూచించారు. మంగళవారం మండలంలోని రాకెట్ల పీహెచ్‌సీలో ఆశా డేను పురస్కరించుకుని ప్రభుత్వం ద్వారా సరఫరా అయిన యూనిఫాంలు, మెడికల్ కిట్లను ఆశా కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

రాయదుర్గంటౌన్/కణేకల్లు/కూడేరు/శెట్టూరు/వజ్రకరూరు: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలంటూ డిమాండ్ చేస్తూ మంగళవారం రాయదుర్గం, కణేకల్లు, కూడేరు, శెట్టూరు, వజ్రకరూరులో నిరవధిక సమ్మె చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

తూనికలు, కొలతల అధికారుల దాడి

బొమ్మనహాళ్: మండలంలో తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ శంకర్ మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. మండలంలోని ఎల్‌బీ నగర్ గ్రామంలో ఓ వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో ఉన్న 80 ప్యాకెట్లు బియ్యం, విక్టోరియా బ్రాండ్ బ్యాగ్‌లను అక్కడికక్కడే తూకం చేశారు. 26 కిలోలకుగాను 24 కిలోలు మాత్రమే తూకం రావడంతో రూ.40 వేలు జరిమానా విధించారు. వినియోగదారులను మోసగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ ప్రకాష్, టెక్నీషియన్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూభాషపై విద్యార్థులకు అవగాహన

రాయదుర్గం రూరల్: స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ భాషగా ఉర్దూ భాషను చదువుతున్న విద్యార్థినులకు పాఠ్యాంశాలకు సంబంధించి సత్యసాయి జిల్లా కదిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఉర్దూ అధ్యాపకులు యాసిన్ పీరాతో అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ రఘురామమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ భాష అభివృద్ధికి విశేష కృషి చేస్తోందన్నారు.